సాక్షి
రాజన్న సిరిసిల్ల

బుధవారం । 22 । ఫిబ్రవరి । 2023



పోచమ్మ తల్లికి బోనం

వేములవాడ: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్ది పోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



3,938 మందికి కంటి పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లావ్యాప్తంగా మంగళవారం 3,938 మందికి కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. 526 మందికి రీడింగ్, 371 మందికి పాయింట్ అద్దాలు అందించారు.

గరిష్ఠం/కనిష్ఠం
35.0/18.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సిద్దోగానికి రండి



మంత్రి కేటీఆర్‌తో నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలం రాచర్లగొల్లపల్లిలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే శ్రీరేణుక ఎల్లమ్మ సిద్దోగ వేడుకలకు హాజరుకావాలని మంత్రి కేటీఆర్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావుకు గౌడ సంఘం సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. జిల్లా గౌడసంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, నాయకులు ఉన్నారు.

వేములవాడ ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న అధికారులు

సిరిసిల్ల: జిల్లాలోని వేములవాడ పట్టణంలో ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. వేములవాడలోని విజేత ఆర్థో, శ్రీరాజన్న డెంటల్, దుర్గా డెంటల్, శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారుల బృందం తనిఖీ చేసింది. ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు హాస్పిటల్ నిర్వహణ ఉందా.? ఏమైనా లోపాలున్నాయా.. క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తనిఖీల్లో డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డెప్యూటీ డీఈఎంవో డాక్టర్ సంతోష్, ఎన్జీవో ప్రతినిధి చింతోజు భాస్కర్, వైద్య సిబ్బంది బాలయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని నిర్మాణాలు కూల్చివేత



ప్రహరీని కూల్చివేస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్

కోనరావుపేట(వేములవాడ): ఎలాంటి అనుమతులు లేకుండా పచ్చని పొలాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్న వ్యవహారంపై అధికారులు స్పందించారు. 'ప్లాట్లుగా మారుతున్న పొలాలు' శీర్షికతో ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు కదిలారు. ప్లాట్ల వద్ద నిర్మించిన ప్రహరీ తొలగించి, లోపల ఏర్పాటు చేసిన ఖనీలను తీసేశారు. కోనరావుపేట మండలం కొలనూర్‌లోని సర్వేనంబర్లు 29/సీ, 39/ఏ, 269/డీ, 472/ఈ, 671/డీ, 702/సీ, 704/ఏ లలోని పంట పొలాలను కొని ప్లాట్లుగా మార్చారు. లేఅవుట్ లేకుండానే విక్రయిస్తున్నారని గ్రామ ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో ప్లాట్లలో చేపడుతున్న నిర్మాణాలను కూలగొట్టాలని నెలరోజుల క్రితమే సర్పంచ్, కార్యదర్శికి ఆదేశాలు వచ్చాయి. వారు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తుండడంతో ఎంపీవో రాజు ఆధ్వర్యంలో మంగళవారం జేసీబీతో ప్రహరీని, ఖనీలను తొలగించారు. పై సర్వే నంబర్లలోని భూములు కొనుగోలు చేయరాదని, ఒకవేళ కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ కావని అధికారులు పేర్కొన్నారు.

ముస్తాబాద్ చేరిన కాళేశ్వరం జలాలు



మద్దికుంట కెనాల్‌లో గోదావరి జలాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు చేరుకున్నాయి. యాసంగి పంటలకు ఢోకా లేకుండా మంత్రి కేటీఆర్ చొరవతో కాళేశ్వరం ప్రాజెక్టు గోదావరి జలాలు ముస్తాబాద్ మండలానికి మంగళవారం చేరాయి. దుబ్బాక మీదుగా మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా మోహినికుంట, మద్దికుంట, చీకోడు గ్రామాలకు గోదావరి నీరు చేరింది. ప్రధాన కెనాల్ ద్వారా చీకోడు, మద్దికుంట, ముస్తాబాద్, గూడెం, పోతుగల్, ఆవునూర్ చెరువులను సంబంధిత అధికారులు నింపుతారని ఎంపీపీ శరత్‌రావు తెలిపారు. యాసంగి సాగుకు ఇబ్బందులు లేకుండా మంత్రి కేటీఆర్ మల్లన్నసాగర్ జలాలను విడుదల చేసేలా ఆదేశాలు జారీ చేశారన్నారు. కాగా వరిపంటకు నీరు ఎక్కువ అవసరం ఉన్న సమయంలో గోదావరి జలాలు రావడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో వసూళ్లకు చె'కింగ్'..!



- తనిఖీ పేరిట అవినీతి
- అడిగినంత ఇస్తే.. అన్నీ మాఫీ..!
- ఏ 'పంచాయతీ'కి వెళ్లినా.. ముడుపుల బేరాలే..!
- ఆయన తీరు అదో తిర'కాసు'..
- కిందిస్థాయి అధికారులే మధ్యవర్తులు

సిరిసిల్ల: జిల్లాలో ఓ డివిజనల్ స్థాయి పంచాయతీ అధికారి అవినీతి చేష్టలు పరాకాష్టకు చేరాయి. ప్రజాధనం క్షేత్రస్థాయిలో సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన అధికారులే అవినీతికి పాల్పడుతూ అక్రమాలకు ఊతమిస్తున్నారు. జిల్లాలోని పలువురు గ్రామపంచాయతీల సర్పంచులు, పాలకవర్గాలపై అవినీతి ఫిర్యాదులు జిల్లా అధికారులకు వస్తుంటాయి. ఆ ఫిర్యాదుల్లో వాస్తవాలు ఏమిటో క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి నిగ్గు తేల్చాల్సిన అధికారులు అవినీతి రుజువైనా.. చర్యలు తీసుకోకుండా.. అక్రమార్కులతో చేతులు కలిపి అందినకాడికి దండుకుంటున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అడ్డుపెట్టుకుని తనిఖీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ముడుపులు వాపస్

వేములవాడ రూరల్ మండలంలోని రెండు గ్రామాల్లో అవినీతి జరిగిందని స్థానికులు జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు వచ్చిన డివిజనల్ స్థాయి అధికారి విచారణ పేరిట గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించి తప్పులు జరిగినట్లు తేల్చారు. సదరు సర్పంచులపై చర్యలకు సిఫార్సు చేయకుండా ఉండాలంటే.. ముడుపులు ఇవ్వాల్సిందేనని విచారణ అధికారి తేల్చి చెప్పారు. దీంతో సదరు సర్పంచులు వేర్వేరుగా రూ.20వేలు, రూ.10వేలు ముడుపులు అప్పగించినట్లు సమాచారం. విచారణ నివేదికలు జిల్లా అధికారులకు చేరకపోవడంతో ముడుపుల విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో తీసుకున్న ముడుపులు వాపస్ ఇచ్చి మరీ సదరు సర్పంచులపై చర్యలకు సిఫార్సు సిద్ధమైనట్లు తెలిసింది.

కలెక్టర్ ఆగ్రహం

తాజా పరిణామాలపై జిల్లా కలెక్టర్ సదరు అధికారిపై ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. వేములవాడ రూరల్ మండలంలోని పరిణామాలపై నివేదిక కోరినట్లు తెలిసింది. డివిజనల్ స్థాయి అధికారి పంచాయతీల తనిఖీల పేరిట భారీ ఎత్తున అవినీతికి పాల్పడినట్లు వెలుగులోకి రావడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈ విషయమై వివరణ కోరేందుకు సదరు అధికారిని మంగళవారం సంప్రదించేందుకు ప్రయత్నించగా.. రెండు ఫోన్లు స్విచ్ఛ్ ఆఫ్ ఉండడం కొసమెరుపు.

కార్యదర్శులకు తప్పని తిప్పలు

జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సదరు అధికారి తీరుతో ఇబ్బందులు పడుతున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా హరితహారంలో మొక్కల పెంపకం, పారిశుధ్య నిర్వహణ, క్లోరినేషన్, గ్రామపంచాయతీల ఆదాయ, వ్యయాల రికార్డుల పరిశీలన, స్థిరాస్తుల సమాచారం, ఇంటి నిర్మాణ అనుమతులు, లేఅవుట్ స్థలాలు, గ్రామసభ తీర్మానాలు, ఆర్థిక యాక్షన్ ప్లాన్, ఉపాధిహామీ యాక్షన్ ప్లాన్ వంటి వాటిని ఎంపీడీవోలు, డీఎల్‌పీవో, డీపీవో, డీఆర్‌డీఏ అధికారులు ఇతర జిల్లా అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. కానీ సదరు డివిజన్ అధికారి తనిఖీలకు వస్తే ఏదో కారణం చూపుతూ ముడుపులు దండుకుంటున్నట్లు క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. ఆ సారు వచ్చిండంటే చాలు.. ఏది ఏమైనా కనీసం రూ.5వేలు ఇవ్వనిదే వెళ్లడనే భావన క్షేత్రస్థాయిలో పని చేసే అధికారుల్లో వ్యక్తమవుతోంది. కొందరు ఎంపీవోలు మధ్యవర్తులుగా ఉంటూ డబ్బులు వసూలు చేసి ఇస్తూ, వాళ్లు కొంత సొమ్మును నొక్కేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఓ ఎంపీవో సస్పెండ్ కావడానికి సదరు డివిజనల్ స్థాయి అధికారి తీరే కారణంగా భావిస్తున్నారు.

కాసులిస్తేనే ఒకే..

గ్రామపంచాయతీల తనిఖీలకు వచ్చే సదరు అధికారితో ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. నిజానికి వివిధ అభివృద్ధి పనులను చేసి, బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని సైతం వదలకుండా, తప్పులు వెతికి మరీ ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. గతంలో గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితి బాగున్న రోజుల్లో ఆఫీసర్ వచ్చాడని ఏంతో కొంత ముట్టచెప్పితే.. అదే అలవాటుగా మారి ఇప్పుడు ఏదో వంక పెడుతూ, రికార్డుల్లో తప్పులు వెతుకుతూ, చెక్ పవర్ రద్దు అవుతుందని భయపెడుతూ కాసుల బేరాలు ఆడుతున్నట్లు తెలిసింది. సదరు అధికారి తనిఖీలకు వస్తుండని తెలిస్తే.. చాలా మంది ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండకుండా వెళ్తున్నట్లు సమాచారం.

వలస కార్మికుల పిల్లల గుర్తింపు



రాళ్లపేట స్టోన్ క్రషర్‌లో వివరాలు సేకరిస్తున్న జిల్లా కోఆర్డినేటర్ శైలజ

సిరిసిల్ల: జిల్లాలోని తంగళ్లపల్లి మండలం రాళ్లపేట స్టోన్ క్రషర్ వద్ద వలస కార్మికుల పిల్లలను విద్యాశాఖ జిల్లా కో ఆర్డినేటర్ శైలజ మంగళవారం గుర్తించారు. స్కూల్‌కు వెళ్లకుండా స్టోన్ క్రషర్‌లో ఉంటున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఐదుగురు పిల్లలను గుర్తించి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టోన్ క్రషర్ యజమానులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి స్థానిక గాంధీనగర్ స్కూల్‌లో పిల్లలను చేర్పించారు. బడి ఈడు పిల్లలు స్కూల్‌కు వెళ్లాలని, బడి బయట ఉండ కూడదని శైలజ కోరారు.

చెరువు మరమ్మతు పనులు ప్రారంభం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వన్‌పల్లి గ్రామంలో హనుమయ్య చెరువు మరమ్మతు పనులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బూల సంతోష్, సెస్ డైరెక్టర్ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సర్పంచులు లత మల్లేశం, రవినాయక్, మల్లేశం, శ్రీనివాస్, ఉప సర్పంచ్ శేఖర్, ఎంపీటీసీ పద్మ సేవ్య నాయక్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, నాయకులు చిన్న మల్లేశం, చంద్రం, లక్ష్మణ్, మల్లారెడ్డి, కళా తిరుపతి, ఉస్మాన్, దేవయ్య, రాజు, దర్శింగ్ తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో 'మహా'జాతర సక్సెస్



ఆర్డీవో శ్రీనివాస్‌రావుకు మెమోంటో అందిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లా యంత్రాంగం సమష్టి కృషితో వేములవాడ రాజన్న సన్నిధిలో మహాశివరాత్రి జాతర సక్సెస్‌ఫుల్‌గా నిర్వహించామని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేములవాడ రాజన్న సన్నిధిలో లక్షలాది మంది భక్తులు వచ్చినా, జిల్లా యంత్రాంగం అందరూ బాగా పని చేశారని అభినందించారు. అందరి కృషితో జాతరలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతమైందన్నారు. మహాశివరాత్రి జాతర కోసం పని చేసిన అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, అడిషనల్ ఎస్పీ డి.చంద్రయ్య, ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, వేములవాడ డీఎస్పీ కె.నాగేంద్రచారి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, జెడ్పీ సీఈవో బి.గౌతమ్‌రెడ్డి, డీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, సీపీవో పీ.బీ.శ్రీనివాసచారి, ఆర్టీసీ డీఎం మురళీకృష్ణ, ఈఈలు అమరేందర్‌రెడ్డి, విజయ్‌కుమార్, శ్యామ్‌సుందర్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, డీటీవో వై.కొండల్‌రావు, తహసీల్దార్ రాజు, డీపీఆర్‌వో దశరథం, వేములవాడ టౌన్ సీఐ వెంకటేశ్ తదితరులకు మెమోంటోలు అందించి అభినందించారు. మహాశివరాత్రి జాతర సక్సెస్‌కు క్షేత్రస్థాయిలో నిద్రాహారాలు మాని శ్రమించిన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ అభినందనలు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి

సిరిసిల్లఅర్బన్: ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగే చూడాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలకు ఎన్‌క్వాస్ గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో వైద్యఆరోగ్య శాఖ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు తొలి కాన్పులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోనరావుపేట పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ అష్యురెన్స్ స్టాండర్డ్ గుర్తింపు రావడంపై హర్షం వ్యక్తంచేశారు. అదే స్ఫూర్తితో అన్ని పీహెచ్‌సీలకు గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి డా.రజిత, సిరిసిల్ల, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్లు మురళీధర్‌రావు, మహేష్ ఉన్నారు.

అధ్వానపు దారి !

- ప్రయాణికుల ఇబ్బందులు
- తారులేచి.. ప్రమాదకరంగా..
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇది రుద్రంగిలోని ఇందిరాచౌక్‌లో గల కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి. రోడ్డు శిథిలమై గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అడుగుకో గుంత పడి ప్రమాదకరంగా మారింది.



ఇది రుద్రంగి మండలకేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో గల కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి. ఈ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. తారులేచిపోయి, కంకరతేలిన ఈ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా ఇలాగే ఉంటున్నా పట్టించుకునేవారు లేరు.

రుద్రంగి(వేములవాడ): అడుగుకో గుంత.. అంతలోనే మూలమలుపు.. తారులేచి అధ్వానంగా మారింది కోరుట్ల–వేములవాడ ప్రధాన రోడ్డు. రుద్రంగి మండల కేంద్రంలో పరిస్థితులు మరీ దారుణంగా తయారయ్యాయి. రుద్రంగిలోని రోడ్డు శిథిలమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న వారే లేరు. ఈదారి గుండా నిత్యం వందలాది మంది వేములవాడ, కోరుట్లకు ప్రయాణం చేస్తుంటారు.

రూ. 9 కోట్లు మంజూరు..

రుద్రంగిలో ధ్వంసమైన రోడ్డుతో స్థానికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఈరోడ్డు మరమ్మతుకు రూ.9కోట్లు మంజూరయ్యాయి. అయినా పనులు మొదలుపెట్టలేదు. తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



రుద్రంగిలో అధ్వానంగా ఉన్న రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ గుంతలు పడడంతో రాత్రి వేళల్లో కనిపించక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. త్వరగా రోడ్డును బాగు చేయాలి.

– పల్లికొండ గంగాధర్, రుద్రంగి

పనులు ప్రారంభిస్తాం



కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారి దెబ్బతిన్నది. తాత్కాలిక మరమ్మతులు చేస్తే ప్రయోజనం ఉండదు. ఫోర్‌లేన్ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. అగ్రిమెంట్ కాగానే పనులు ప్రారంభిస్తాం.

– సతీశ్, ఆర్‌అండ్‌బీ, ఏఈ

కోనరావుపేట పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు

- ఇటీవల ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం
- ఆస్పత్రిలో నాణ్యమైన సేవలకు దక్కిన పురస్కారం



కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



ఆస్పత్రిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. పీహెచ్‌సీలో అందిస్తున్న నాణ్యమైన సేవలకు గాను జాతీయస్థాయి పురస్కారానికి ఎంపిక చేశారు. జాతీయ ప్రమాణాల నాణ్యత బృందం సభ్యులు దేవేంద్ర కుమార్ బిట్టోరియా, అభిషేక్ సుభాష్ గోసవి గత డిసెంబర్ 26న కోనరావుపేట ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఆస్పత్రిలోని అన్నిరకాల సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవల గురించి తనిఖీ చేశారు.

ఉమ్మడి జిల్లాలో ఏకైక పీహెచ్‌సీ

గత డిసెంబర్‌లో ఉమ్మడి జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలను కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్యసేవలు, నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను పరిశీలించారు. భారత ప్రభుత్వ వైద్య, కుటుంబసంక్షేమ శాఖ క్వాలిటీ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇందులో ఉమ్మడి జిల్లాలోని కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఓపీడీలో 85 శాతం, ల్యాబరేటరీ నాణ్యతలో 97 శాతం, లేబర్ రూమ్ క్వాలిటీలో 91 శాతం, ఇన్‌పేషంట్ విభాగంలో 85 శాతం, నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలో 91 శాతం, సాధారణ అడ్మినిస్ట్రేషన్‌లో 92 శాతం స్కోర్ సాధించింది. అన్ని విభాగాల్లో 90శాతం మార్కులు సాధించడంతో గుర్తింపు దక్కింది. దీంతో ఆస్పత్రి అభివృద్ధికి ఏటా నిధులు మంజూరుకానున్నాయి.

కష్టానికి ఫలితం దక్కింది



ఆరోగ్యకేంద్రానికి జాతీయ బృందం వస్తుందని తెలియడంతో అందరం శ్రమించి పనులు చేశాం. ఆస్పత్రి లోపల, బయట పరిసరాలను శుభ్రంగా తీర్చిదిద్దాం. సీనియర్, జూనియర్ తేడాలేకుండా చాలా కష్టపడ్డాం. నెల రోజులు శ్రమించి చేసిన పనులకు గుర్తింపు దక్కడం చాలా సంతోషంగా ఉంది.

– లక్కాకుల శ్రీదేవి, సీనియర్ సూపర్‌వైజర్

ఆనందంగా ఉంది



కోనరావుపేట పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు రావడం సంతోషకరం. ఆస్పత్రిలో పలు రకాల అభివృద్ధి పనులు చేసుకునేందుకు మూడేళ్ల పాటు సహకారం లభిస్తుంది. ఆస్పత్రిలోని సూపర్‌వైజర్లు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నందున గుర్తింపు రావడం సాధ్యమైంది.

– వేణుమాధవ్, వైద్యాధికారి

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లఎడ్యుకేషన్: పరిశోధన అంటే నిజనిజాలను తెలుసుకుని వాస్తవికతను ప్రపంచానికి తెలపడం అని, విద్యార్థులు ఎప్పుడూ నిత్య సాధకులుగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం పక్షాన గీతానగర్ జిల్లా పరిషత్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ఆన్‌లైన్ ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులు ఎల్లప్పుడు లక్ష్యాలని నిర్దేశించుకొని చదివి ముందుకుసాగాలన్నారు. సైన్స్ అంటే నిత్య సత్యాన్వేషణ దృక్పథం అలవరచుకోవడమేనని, ఇంజినీరింగ్, మెడిసిన్ పరీక్షల్లో ఫిజికల్ సైన్స్ కీలక పాత్ర పోషించడం జరుగుతుందన్నారు. దీని కోసం ఇప్పటి నుంచి విద్యార్థులు పట్టుదలతో కృషి చేయాలన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పులి రాజుగౌడ్ పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచినవారిలో ఆర్.అభిషేక్ (జెడ్పీహెచ్ఎస్ దుమాల), వి.మణిచరణ్ (జెడ్పీహెచ్ఎస్ మూడపల్లి) ఉన్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు పి.ఐశ్వర్య (జెడ్పీహెచ్ఎస్ సుద్దాల, ఎ.వరుణ్ (జెడ్పీహెచ్ఎస్ కొత్తపల్లి)లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్ శైలజ, ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, ఫోరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులి రాజు గౌడ్, దరిపెల్లి శ్రీనివాస్, భారతి ఫౌండేషన్ బాధ్యులు విజయ్, ఉపాధ్యాయులు దోర్నాల భూపాల్‌రెడ్డి, బాలచందర్, రాజిరెడ్డి, బ్రహ్మం, భూమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

భగత్‌సింగ్ స్ఫూర్తి యువతకు ఆదర్శం



పుస్తక పఠనం చేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్ అన్నారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్ట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రెడ్ బుక్ డే సందర్భంగా భగత్‌సింగ్ జీవిత చరిత్ర సామూహిక పఠనం చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి భగత్‌సింగ్ అని, ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు. బీజేపీ మత విద్వేశాలను యువత తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోడం రమణ, సూరం పద్మ, ప్రశాంత్, మోర అజయ్, రమేష్‌చంద్ర, కవిత, సత్యం, వీరేశం, తదితరులు ఉన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జరిగాయి. అండర్- 14, 16, 18, 20 బాల బాలికలు, మహిళ, పురుషులకు 400 మీటర్లు రన్నింగ్, తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది క్రీడాకారులు ఎంపికై నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు, బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. కాగా వీరు ఈనెల 25, 26వ తేదీల్లో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీలు సాయికృష్ణ, రాజు, ప్రభాకర్, జ్యోష్న, పార్వతి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు

వేములవాడరూరల్: మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన కొండవేని ప్రశాంత్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. ప్రశాంత్ తన స్నేహితుడైన జక్కుల సురేష్ ఇంటికి వెళ్లి బండరాళ్లతో వాహనాన్ని ధ్వంసం చేసి, అతడిపై దాడి చేయడంతో పాటు కుటుంబసభ్యులను దూషించినట్లు తెలిపారు. సురేష్ ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పరీక్షా కాలం తస్మాత్ జాగ్రత్త..!

- ఒత్తిడి తట్టుకోలేకపోతున్న విద్యార్థులు
- ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్య
- పిల్లలను తల్లిదండ్రులు గమనించాలి: మానసిక నిపుణులు

"బడికి వెళ్లాలని తల్లి చెప్పి మంచిమాటలకు నొచ్చుకుని ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి భాస్కర్ వారం క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిల్లలు లేరని దత్తత తీసుకుంటే.. చేతికొచ్చే సమయంలో చనిపోవడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం.

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన పదో తరగతి విద్యార్థిని జాగృతి (15) టెస్ట్ ప్రీ ఫైనల్ పరీక్షలో తక్కువ మార్కులు వచ్చాయని ప్రాణం తీసుకుంది. పిండిగిర్నీ నడుపుతూ జీవించే తల్లిదండ్రులకు కూతురు దూరమవడం తీరని శోకాన్ని మిగిల్చింది."

సిరిసిల్లక్రైం: తల్లిదండ్రులు మంచిమాటలు చెప్పినా పిల్లలకు ఆగ్రహం తెప్పిస్తోంది. బడికెళ్లి చదువుకోవాలని చెబితేనే ఇబ్బంది పడుతున్నారు. తీరా పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని ప్రాణాలు తీసుకొని.. కన్నవారికి తీరని వేదనను మిగుల్చుతున్నారు. ఇటీవల ఈ వైఖరి జిల్లాలో ఎక్కువైంది. తల్లిదండ్రులు చెబుతున్నవి వారి భవిష్యత్ కోసమేనన్న ఆలోచన పిల్లల్లో కరువైంది. కొందరు బలవన్మరణాలకు పాల్పడుతుంటే.. మరికొందరు చెడు వ్యవసనాలకు బానిసలుగా మారుతున్నారు. చెడువ్యసనాలు మరింత ముదిరి గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.

మొబైల్ ప్రభావంతో..

ఇటీవల విద్యార్థులలో మొబైల్ ఫోన్‌ల వినియోగం పెరిగింది. కరోనా ప్రభావంతో ఆన్‌లైన్ బోధన రావడంతో ప్రతి ఇంటిలో స్మార్ట్ ఫోన్ కొనాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కరోనా ప్రభావం పూర్తిగా తగ్గినప్పటికీ పలు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు హోంవర్క్ సెల్‌ఫోన్‌లలోనే పంపిస్తున్నారు. ఇలా విద్యార్థులలో సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగిపోయింది. హోంవర్క్‌తోపాటు తోటి స్నేహితులతో ఆన్‌లైన్ చాటింగ్ చేయడం ఎక్కువైంది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీలత విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చాలా మంది తల్లిదండ్రుల తమ పిల్లలతో మొబైల్‌ఫోన్‌ల వినియోగం తగ్గించలేక హాస్టళ్లలో చేర్పుతున్నట్లు వాపోయారు. ఈ విషయాన్ని ఇటీవల జిల్లాలోని పలు వసతిగృహాల్లో పెరిగిన ప్రవేశాలను చూస్తే అర్థమవుతుంది.

కరువైన పర్యవేక్షణ

బడికి పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులు తర్వాత వారి ప్రవర్తన, చదువు ఎలా ఉందనే విషయాలను పట్టించుకోవడం లేదు. ప్రస్తుత తల్లిదండ్రుల్లో ఇద్దరు ఉద్యోగాలు చేస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. ఈ సమయంలో విధుల్లో అలసిపోయి ఇంటికొస్తున్న వారు తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాన్ని గ్రహించడం లేదు. అంతేకాకుండా పాఠశాలల్లో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాలకు 30 శాతం పేరెంట్స్ కూడా హాజరుకావడం లేదని జిల్లాలోని సీనియర్ ఉపాధ్యాయుడు తెలిపారు. విద్యార్థుల చదువు, ప్రవర్తను గురించి చెప్పుదామన్న తల్లిదండ్రులకు స్కూల్‌కు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

గమనిస్తూ.. నివారించడమే మార్గం



పిల్లల ప్రవర్తనలో ఏదేని మార్పు కనిపిస్తే వెంటనే కనిపెట్టి తగు సూచనలు చేయాలి. చదువు అంటే ఉద్యోగం, మార్కుల కోసం కాదని జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవడం అనేది అవగాహన కల్పించాలి. బడిలో నేర్పుతున్న విషయాలను వారంలో ఒక రోజు ఇంట్లో చర్చించాలి. పిల్లలకు మనం ఉన్నామన్న భరోసా కల్పించాలి.


– సురేంద్రబాబు, పిల్లల వైద్యనిపుణులు, సిరిసిల్ల

మానసిక నిపుణుల సూచనలు ఇలా..

- విద్యార్థులపై దృష్టి పెట్టాలి.
- చెడు వ్యవసనాలతో కలిగే నష్టాల గురించి వివరించాలి.
- పదే..పదే మార్కులు సాధించాలని, ర్యాంకుల సాధనే భవిష్యత్ అనే మాటలను పక్కబెట్టి.. మరింత చదువు వైపు వెళ్లేలా చూడాలి.
- పాఠశాలకు వారానికోసారైన వెళ్లి పిల్లల మానసిక స్థితిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి.
- చదువుతోపాటు వారంతంలో కనీస మానసిక ఉల్లాసాన్ని కలిగేలా పిల్లలతో గడపాలి.
- పిల్లల మానసిక స్థితిలో ఏదేని మార్పుల కనిపిస్తే ఉపాధ్యాయులకు తెలపడంతోపాటు, సంబంధిత వైద్యనిపుణులకు చూపించాలి.

జగ్గారావుపల్లెలో చిరుత కలకలం?

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి జగ్గారావుపల్లె శివారు తూముకుంట చెరువు పరిసర ప్రాంతాల రైతులకు చిరుత భయం పట్టుకుంది. సిరిసిల్ల పట్టణ శివారు ప్రాంతాలైన చిన్నబోనాల, పెద్ద బోనాలలో గతంలో చిరుత సంచరించి లేగదూడలపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. పది రోజుల క్రితం తంగళ్లపల్లి మండలం గోపారావుపల్లె గ్రామ శివారులో ఓ షెడ్డులో కట్టేసిన దూడపై దాడి చేసి చంపివేసింది. తాజాగా జగ్గారావుపల్లె శివారులో చిరుత పాదముద్రలు గుర్తించినట్లు రైతులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.



రైతులు గుర్తించిన పాదముద్రలు

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడఅర్బన్: 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లుకు తరలిస్తుండగా సీసీఎస్ సీఐ బాలకృష్ణ మంగళవారం పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా వేములవాడ పట్టణంలోని హరిహర రైస్‌మిల్‌కు విక్రయించేందుకు తెస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. రెండు ఆటోల్లో తరలిస్తున్న బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, హరిహర రైస్‌మిల్ యజమానులు చేపూరి సంతోష్, బండ శ్రీనివాస్, కటకం వెంకన్న, అక్కిరాల అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే బియ్యం తరలిస్తున్న పర్వతం నర్సయ్య, పర్వతం వంశీ, గంట సమ్మయ్య, గంట రాజు కూడా కేసు నమోదు చేసి, రెండు వాహనాలను పట్టణ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై మారుతి, టాస్క్‌ఫోర్స్ పోలీసులు తిరుపతి, షబ్బీర్, రాజేశం, మహిపాల్, విజయసారథి ఉన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న కొమురయ్య

ఎలిగేడు(పెద్దపల్లి): మండలంలోని ముప్పిరితోటకు చెందిన చీకటి కొమురయ్య అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుంచి పడి, తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. కొమురయ్య కొన్నేళ్లుగా పెద్దపల్లి పట్టణంలో కల్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే సోమవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు మోకుజారి, కిందపడ్డాడు. ఈ ఘటనలో ఆయన తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కొమురయ్యను సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర న్యాయ సలహాదారు చీకటి సంతోష్‌గౌడ్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌లు మంగళవారం ఆస్పత్రికి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కొమురయ్యకు ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.15 వేలతోపాటు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన సాగర్ల పవన్‌కుమార్(22) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో పవన్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. అప్పటినుంచి మానసిక స్థితి సరిగాలేక ఇంట్లోనే ఉంటున్నాడు. మంగళవారం పొలం వద్దకు వెళ్లి, క్రిమిసంహారక మందు తాగి, పడిపోయాడు. అతని స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వచ్చి, పవన్‌కుమార్‌ను పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోకి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు కమాన్‌పూర్ ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలు సీజ్



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

వేములవాడరూరల్: నంబర్‌ప్లేట్లు సరిగా లేని 7 వాహనాలను సీజ్ చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. నంబర్‌ప్లేట్ సరిగా లేని వాహనాలపై మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 7 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ప్రతీ వాహనదారు నంబర్ ప్లేట్, లైసెన్స్, హెల్మెట్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్లను వంచినా, అడ్డంగా ఏదైనా పెట్టినా వాహనదారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఒకరి బైండోవర్

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన ఇసుక రవాణాదారున్ని తహసీల్దార్ నరేందర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. కనగర్తికి చెందిన పుట్ట చందు ఇసుక రవాణా చేస్తుండగా పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది వద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. నక్కవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఠాణాకు తరలించినట్లు పేర్కొన్నారు.

ఇంటికి చేరిన పర్వతాలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన లంబ పర్వతాలు అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఇంటికి చేరాడు. ఈ నెల 20 నుంచి పర్వతాలు కనిపించడంలేదని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతన్ని చూసి గుర్తుపట్టిన వ్యక్తులు కొండగట్టులో ఉన్నాడని సమాచారం ఇవ్వగా వెళ్లి తీసుకవచ్చినట్లు తెలిసింది.

తుపాకులగూడెం సినిమా హీరో మనోడే



తుపాకుల గూడెం సినిమాలో శివరాంరెడ్డి

వేములవాడరూరల్: కొత్త సినిమా 'తుపాకులగూడెం'లో హీరోగా నటించిన శివరాంరెడ్డి వేములవాడ మండలం నమిలిగుండుపల్లి గ్రామానికి చెందిన వాడు. పల్లెటూరులో పుట్టి పెరిగిన ఆయన పట్టణంలో ఉండి సినిమాలపై ఆసక్తి పెంచుకుని ఎన్నో సినిమాల్లో సైడ్ హీరోగా నటించాడు.

స్వగ్రామానికి గణేశ్ మృతదేహం



గణేశ్ అంతిమయాత్రలో గ్రామస్తులు

మల్లాపూర్(కోరుట్ల): ఉపాధి కోసం కువైట్ వెళ్లి ఈ నెల 16న మృతి చెందిన కొత్తదాంరాజుపల్లి గ్రామానికి చెందిన సుంకె గణేశ్(38) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. శవపేటికన చూసిన తల్లిదండ్రులు సుంకె పెద్దగంగరాం-గంగు, భార్య రాజేశ్వరి, కుమారుడు రోహన్‌రాజు, కుమార్తె రిహన్‌శ్రీ బోరున విలపించారు. అక్కడి ఓ కంపెనీలో పనిచేస్తుండగా ఈనెల 8న హైబీపీతో కుప్పకూలిపోయాడు గణేశ్. సహచర కార్మికులు అక్కడి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. స్వగ్రామానికి చేరిన గణేశ్ మృతదేహానికి అత్యక్రియలు పూర్తిచేశారు. అంతిమయాత్రలో పాల్గొన్న గల్ఫ్ జేఏసీ నాయకులు.. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న హరికృష్ణారెడ్డి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జాతీయ ఫించన్ విధానం (ఎన్‌పీఎస్) విషయంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాతపెన్షన్ విధానాన్ని అమలు పరుస్తున్న రాష్ట్రాల ఉద్యోగుల నుంచి జమచేయబడిన చందా సొమ్మును తిరిగి ఇవ్వడం కుదరదని కేంద్ర ఆర్థిక మంత్రి పేర్కొనడం గర్హనీయమని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చిన్న లింగాపూర్ పాఠశాల ఆవరణలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల జీవితాలను పణంగాపెట్టి వింత వైఖరులు అవలంబిస్తుందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాలు పాత పెన్షన్ పునరుద్ధరించే ప్రయత్నంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ఇలా వ్యవహరించడం తగదన్నారు. రాజస్తాన్ వేదికగా పలు రంగాల వాటాదారులతో జరిగిన బడ్జెట్ అనంతర చర్చల్లో మంత్రి మాట్లాడుతూ కరాఖండిగా ఈపీఎఫ్‌వోలో జమ అయిన మొత్తాన్ని తిరిగి ఇవ్వడం సాధ్యపడదని చెప్పడం సరికాదన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఈనాం భూముల పట్టాలు రద్దు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



మాట్లాడుతున్న గుంటి వేణు

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలో 172 సర్వే నంబర్‌లో రజక కులస్తుల 8 ఎకరాల ఇనాం భూమిని రెవెన్యూ అధికారులు అదే గ్రామానికి చెందిన ఓ రైతు పేరిట పట్టా చేశారని, పట్టా రద్దు చేసి రజకులకే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన సుంకరి ఎల్లవ్వ, సుద్దాల ప్రభాకర్‌కు 8 ఎకరాల ఈనాం భూమి ఉండగా, కొన్నేళ్ల పాటు వారు వలస వెళ్లారు. దీంతో అదే గ్రామానికి చెందిన ఓ రైతు సదరు భూమిని అక్రమంగా పట్టా చేయించుకున్నాడని, పట్టా చెల్లదని స్థానిక తహసీల్దార్ పంచనామ ఇవ్వడం జరిగిందన్నారు. కలెక్టర్ స్పందించి సదరు భూమిని పేద రజకులకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో ఐదువేలకు పైగా ఈనాం భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయని, వాటిపై సర్వే జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మంద సుదర్శన్, మల్లేశం గౌడ్, తిరుపతిరెడ్డి, మల్లేశం, అమీనాబేగం, చంద్రం, లక్ష్మణ్, రాజేందర్ తదితరులున్నారు.

ఈ-శ్రమ్ కార్డుతో అసంఘటిత కార్మికులకు భరోసా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు తదితరులు

సిరిసిల్లఅర్బన్: అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు భరోసా అని కరీంనగర్ జాయింట్ కమిషనర్ లేబర్ ఆఫీసర్ సునీత అన్నారు. మంగళవారం కార్మిక శాఖ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో స్థానిక వస్త్ర వ్యాపార సంఘంలో ఈ-శ్రమ్ కార్డుపై అవగాహన, ఉచిత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లేబర్ ఆఫీసర్ సునీత హాజరై మాట్లాడారు. ఈ శ్రమ్ కార్డు అసంఘిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు గొప్ప వరం లాంటిందన్నారు. కార్డుతో కార్మికులకు భద్రత లభిస్తుందన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు ఉన్నవారు, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు లేని అసంఘటిత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఈ శ్రమ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కరీంనగర్ ఎస్.రమేష్‌బాబు, జగిత్యాల అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజేశ్వరమ్మ, రాజన్న సిరిసిల్ల జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, జూనియర్ అసిస్టెంట్ రాంచంద్రం, కౌన్సిలర్ గుండ్లపెల్లి నీరజ, న్యాక్ ఇన్‌చార్జి గోలి ప్రకాష్, దేవేంద్ర, ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, మీసం లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో మహిళలకు ఉపాధి

- నాబార్డ్ ఏజీఎం మనోహర్



సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామీణ ప్రాంత మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం నాబార్డ్ ద్వారా కుట్టు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నట్లు నాబార్డ్ ఏజీఎం మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మంత్రి కేటీఆర్ దత్తత గ్రామం రాజన్నపేటలో 90 మంది మహిళలకు 15 రోజులపాటు శిక్షణ ఇచ్చి రూ.750 నగదుతోపాటు సర్టిఫికెట్లను మంగళవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ, మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం ప్రతీ మహిళ ఏదో ఒక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ ముక్క శంకర్, ప్రభునాయక్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు జబ్బార్, బాల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నాబార్డ్ ఈవో సంపత్‌కుమార్, కోఆర్డినేటర్ రాజు, ఫ్యాషన్ డిజైనర్ మనీష పాల్గొన్నారు.

తల్లి చెంతకు బాలుడు



బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

సిరిసిల్లక్రైం: తప్పిపోయిన బాలుడిని సిరిసిల్ల టౌన్ పోలీసులు సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసుల వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామానికి చెందిన ఆసన్నగారి రేఖకు కొడుకు, కూతురు సంతానం. కూతురు ఆరోగ్యం బాగలేకపోవడవంతో ఇద్దరు పిల్లలతో సిరిసిల్ల వెంకంపేటలోని ఓ ఆసుపత్రికి వచ్చింది. ఈ క్రమంలో పెద్దవాడైన విశ్వనాథ్ (మూడున్నరేళ్ల అబ్బాయి) ఆడుకుంటూ రోడ్డు మీదకు వెళ్లాడు. కూతురుతో తల్లి ఆస్పత్రిలోనే ఉండిపోగా, బాలుడు రోడ్డుమీద తచ్చాడుతున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడి ఫొటోలను సిరిసిల్ల వాట్సాప్ గ్రూప్స్‌లో పెట్టగా, గుర్తించిన బాలుడి తల్లి సిరిసిల్ల టౌన్‌పోలీసు స్టేషన్ చేరుకుని కొడుకు అక్కునచేర్చుకుంది. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది. కాగా గంట వ్యవధిలో బాలుడిని కుటుంబీకులకు అప్పగించిన పోలీసుల తీరును స్థానికులు మెచ్చుకుంటున్నారు.

పేదల కడుపు నింపుతున్న తాపీమేస్త్రీ



పేదలకు భోజనం అందిస్తున్న శేఖర్

వేములవాడరూరల్: పేదలకు సాయం చేయాలనే సంకల్పం ఉంటే చాలు, వారు ధనవంతులు కానవసరం లేదు. ఏదో విధంగా పేదల కడుపు నింపాలని అనుకున్నాడు మున్సిపల్ పరిధిలోని హన్మక్కపల్లి 15వ వార్డుకు చెందిన శేఖర్ సేనాపతిగా పిలువబడే కొట్టెపల్లి శేఖర్. ఒక తాపీ మేస్త్రీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం కాని ఎలాగోలా పేదోళ్ల కడుపు నింపాలనే ఆయన సంకల్పం ఆయనను ముందుకు నడిపించింది. అన్నం లేక అల్లాడిపోయే నిరుపేదలను చూసి చలించిపోయి వారి కోసం యువ చైతన్య దీపం ఫౌండేషన్ పేరుతో 2013 సంవత్సరంలో ఒక సంస్థను స్థాపించాడు. జిల్లాలో ఎక్కడ ఫంక్షన్ అయినా ఆహార పదార్థాలు మిగిలితే ఆయనకు ఫోన్ చేసిన వెంటనే స్పందించి, వాటిని నిరుపేదలకు చేరవేయడం ఆయన దినచర్యలో భాగమైంది. ఫుడ్ బ్యాంక్ పేరుతో ఉన్న వాహనంలో నిరుపేదలుండే ప్రాంతాలు, అలయ పరిసరాలు, కాలనీల్లో భోజనాన్ని అందజేస్తున్నాడు. ఎన్నో ఏళ్లుగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించి పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా.కొండ దేవయ్య ఆయనకు 2020లో ఒక వాహనాన్ని అందజేశాడు.

నిరుపేదలకు సేవ తృప్తినిస్తోంది

నిరుపేదల కడుపు నింపడం తృప్తినిస్తోంది. ఎన్ని పనులున్నా భోజనాన్ని తీసుకెళ్లి పేదలకు అందజేస్తా. అలాగే పేదల కోసం ఒక ఆశ్రమాన్ని నిర్మిస్తున్నాను. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి సాయం చేస్తే నిరుపేదల కోసం సేవ చేస్తా.

– కొట్టెపల్లి శేఖర్, హన్మక్కపల్లి